

# మల్లాది వెంకటకృష్ణమూర్తి

## ఆయా

కష్టాలన్నీ కట్టకట్టుకుని ఒకేసారి వస్తాయి అన్న సూక్తి రామచంద్రమూర్తి విషయంలో రుజువైంది.
అతనికున్న ఐశ్వర్యం అతన్ని ఏ కష్టం నుంచి కాపాడలేకపోయింది.

పదేళ్ళ క్రితం వివాహం అయిన రామచంద్రమూర్తి భార్య ఆరేళ్ళ క్రితం పోయింది. ఆ దుఃఖంలోంచి అతను తేరుకునే లోగానే అతని రెండో కొడుకు మూత తెరచి వున్న నీళ్ళ టేంక్‌లో పడి మరణించాడు. అతని గుండె చెరువైంది.

ఉన్న ఒక్క కొడుకుని జాగ్రత్తగా పెంచసాగాడు. తను పునర్వివాహం చేసుకుంటే ఎలాంటి మహాతల్లి వస్తుందోనన్న భయంతో కొడుకు కోసం పెళ్లి మాట తలపెట్టలేదు.

సంవత్సరం క్రితం ఎవరో శాపం పెట్టినట్టుగా వున్న ఒక్క కొడుకు బ్లడ్ కాన్సర్ వచ్చి సంవత్సరం మృత్యువుతో హోరాహోరీ పోట్లాడి చివరికి ఓడిపోయాడు.

రామచంద్రమూర్తికి నా అనే వాళ్ళెవరూ లేకుండాపోయారు. దూరపు బంధువులు వున్నారని విన్నాడు కాని ఎవరు ఎక్కడు న్నారో తెలీదతనికి. వంట మనిషి, డ్రయివర్, పిల్లల్ని చిన్నప్పటి నుంచి చూసుకోవడానికి నియమింపబడ్డ ఆయా తప్ప ఆ ఇంట్లో మరెవరు లేరు.

పిల్లలిద్దరూ పోయాక ఆయా అవసరం తీరడంతో ఆవిడని పని లోంచి తీసేయాలనుకున్న రామచంద్రమూర్తి తనకి వెంటనే ఎవ్వరూ వుద్యోగం ఇవ్వరని, ఇంకో వుద్యోగం వచ్చే దాకా తనని భరించమని ఆవిడ కోరడంతో, ఆవిడ పిల్లలిద్దర్ని ఎంతో ప్రేమగా చూసిన విశ్వాసానికి వుంచేశాడు రామచంద్రమూర్తి. కేవలం డబ్బు కోసమే కాక ఆవిడ తన పిల్లల్ని స్వంత కొడుకుల్లా చూసుకుందని రామచంద్రమూర్తి నమ్మకం.

భగవంతునికి రామచంద్రమూర్తి మీద అంతటితో కసి తీరలేదు. కొలెస్ట్రాల్ పెరిగి హార్ట్ ఎటాక్ వచ్చింది. మొదటిది మైల్డ్‌గా వచ్చింది. ఇంకోసారి వస్తే ప్రమాదం అని డాక్టర్లు చెప్పారు. తిండి తగ్గించాల్సి వచ్చింది.

సంవత్సరం తిరక్కుండానే రామచంద్రమూర్తి రెండోసారి హార్ట్ ఎటాక్ రావడంతో ఓ అర్ధరాత్రి పక్కలో పోయాడు. మర్నాడు పని వాళ్ళు చూసి ఏం చేయాలో తోచక ఇరుగు పొరుగుని కేకేసారు.

రామచంద్రమూర్తి బ్రతికుండగానే తన కర్మకాండల నిమిత్తం పక్కింటాయనకి డబ్బిచ్చాడు. ఆయన ఆ డబ్బుతో రామచంద్రమూర్తిని విధాయకంగా పంపించాడు. అతను విల్లు ఏమైనా రాశాడేమోనని ఇల్లంతా వెతికారు. ఎక్కడా విల్లు జాడలేదు. అతని దూరపు బంధువులు కాని, వారసుడు కాని వస్తాడేమోనని ఎదురుచూశారు. కాని ఎవ్వరూ రాలేదు. అలాంటి పరిస్థితిలో అతని ఆస్తి యావత్తూ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది.

ఓరోజు ఆయాకి తెలిసింది రెవిన్యూ అధికారులు రామచంద్రమూర్తి ఇంట్లోని వస్తువులన్నీ వేలం వేస్తున్నారని. ఆవిడకి ఉద్యోగం దొరికి అప్పటికే నాలుగు వారాలైంది. ఆవిడ మనస్సు వుండబట్టలేక రామచంద్రమూర్తి ఇంటికి వెళ్ళింది.

ఇంట్లోని ఫ్రిజ్, టి.వి., కారు వంటివన్నీ అప్పటికే వేలం వేస్తున్నారు. తర్వాత వంట సామాన్లు, ఫర్నిచర్ లాంటివి వేలం వేసారు. ఆఖరిలో ఇంట్లోని వాల్ హేంగింగ్స్, డెకరేటివ్ పీసెస్ వేలం వేశారు. వాటిల్లో రామచంద్రమూర్తి కొడుకు లిద్దర్ని కలిసి తీసిన ఫోటో వుంది. దాన్ని ఎవరూ కొనడానికి ముందుకు రాలేదు. ఫ్రేమ్ విరిగిపోయింది. అద్దం పగిలి వుంది. ఎందుకూ పనికిరాదది.

ఆయా అయిదు రూపాయలకి దాన్ని మరో పోటీదారు లేకుండా కొన్నది. చిన్నప్పటి నుంచి తన చేతులతో పెంచిన పిల్లలు కాబట్టి ఆవిడకి మమకారం చావలేదు. ఆ ఫోటోని తన జీవితాంతం తనతో వుంచుకోవాలన్న కోరికతోనే ఆ వేలం పాటకు వచ్చిందావిడ.

ఫోటోతో ఇంటికి వెళ్ళి దాన్ని మళ్ళీ ఫ్రేమ్ కట్టించడానికి విరిగిన ఫ్రేమ్‌ని విప్పి, పగిలిన అద్దాన్ని పారేసింది. ఆ ఫోటో వెనుక సెల్లోఫిన్ టేప్‌తో అతికించి వుందో కవరు. దాని మీద 'ఆయా'కి అని రాసి వుంది.

ఆశ్చర్యంతో ఆ కవరు తీసి అందులోంచి ఓ కాగితాన్ని తీసింది.

అది రామచంద్రమూర్తి తన ఆస్తి మొత్తం ఆయా పేర రాసిన విల్లు. విల్లు చివరలో ఓ వాక్యం రాసాడు. "ఈ విల్లుని మా ఇంట్లో పిల్లలిద్దరికి ఆయాగా పని చేసిన ఆయా ప్రెజెంట్ చేస్తేనే చెల్లుతుంది. ఆవిడకి నా పిల్లలిద్దరూ అంటే తల్లి కుండాల్సినంత ప్రేమ వుంది. కాబట్టి దీన్ని తప్పక ప్రెజెంట్ చేయగలదనే విశ్వాసం నాకుంది!"

పిల్లల ఫోటో వంక చూసింది ఆయా. వాళ్ళిద్దరూ నవ్వుతూ ఆయా వంక చూస్తున్నారు.

